



షాబాద్ మండలం సీతారాంపూర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం

కొమ్మ కొమ్మకో కొంగ



ఎక్కడెక్కడో పనులు చేసుకుని జనాలంతా ఇళ్లకు చేరినట్లు.. పక్షులు సైతం తిండి కోసం ఎక్కడికో వెళ్లి చీకటి పడుతుందంటే అవన్నీ గూటికి చేరుతాయి. అలా ఒకటి కాదు.. రెండు కాదు.. వేల సంఖ్యలో అక్కడ కొంగలు ఆవాసం ఏర్పచుకున్నాయి. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ సరిహద్దు. సీపీఆర్ఐ వద్ద గల చెరువు నుంచి చూస్తే కనుచూపు మేర వేలాది కొంగలు ఆవాసాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన చీకటి పడిందంటే చాలు ఇది పూల వనమా అన్నట్లు.. చెట్లనిండా తెల్ల కొంగలు కూర్చొని ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

- ఘట్‌కేసర్, ఏప్రిల్ 16

నవమి వేడుకలకు ఆలయాల ముస్తాబు

నేడు శ్రీరామ నవమి.. వైభవంగా జరగనున్న సీతారాముల కల్యాణోత్సవాలు

నేడు నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణోత్సవాల కోసం ఆలయాలను శోభాయమానంగా అలంకరించారు. రంగులు, సున్నం వేసి విద్యుత్ దీపాలు అమర్చారు. దీంతో ఆలయాలు కనువిందు చేస్తున్నాయి. చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్లు, మహేశ్వరం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో నవమి వేడులకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బుధవారం నిర్వహించే సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు ఆలయాలకు భక్తులు పోటెత్తనున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 16

వివరాలు 8లో..

నామినేషన్లకు వేళాయె!

రేపే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్

- నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం!
- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ ఆర్వో ఆఫీస్
- మేడ్చల్ కలెక్టరేట్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంటు ఆర్వో కార్యాలయం ఏర్పాటు



లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఘట్టం రేపు ప్రారంభం కాబోతోంది. చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ పర్వం మొదలు కానుంది. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు సమర్పించేందుకు గడువు ఉన్నా ప్రధాన పార్టీల అభ్యర్థులు అంతకు ముందే మంచి ముహూర్తం చూసుకుని దాఖలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. కాగా , నామినేషన్ల ఘట్టాన్ని ఎవరికి వారు అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ ముఖ్య నేతలను ఆహ్వానించి వారి సమక్షంలో నామినేషన్లు దాఖలు చేయాలని అభ్యర్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలోనే..

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లు స్వీకరణ కార్యక్రమం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో జరగనుంది. వాస్తవానికి చేవెళ్ల పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కొత్తగా నిర్మించిన కలెక్టరేట్ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గం భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉండడంతో విచిత్రి పరిస్థితి ఏర్పడింది. దీంతో చేవెళ్ల పార్లమెంట్ ఆర్వో కార్యాలయాన్ని రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అన్ని సమీక్షలు, మీడియా సమావేశాలు ఇక్కడ నుంచే నిర్వహిస్తున్నారు. ఇక మేడ్చల్ మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి శామీర్‌పేట్ సమీపంలోని కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు.

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్/రంగారెడ్డిఅర్బన్, ఏప్రిల్ 16 : సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూస్తున్న లోక్‌సభ ఎన్నికల ప్రధాన ఘట్టం రేపు ప్రారంభం కాబోతోంది. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు మే 13వ తేదీన ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. రంగారెడ్డి ఉమ్మడి జిల్లా పరిధిలో చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. సెలవు రోజు ఆదివారం మినహా మిగతా అన్ని రోజుల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్‌పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

రెండు చోట్ల నామినేషన్ల స్వీకరణ

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్లను రిటర్నింగ్ అధికారులు జారీ చేస్తారు. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్ల స్వీకరణకు ఏప్రిల్ 25వ తేదీ చివరి తేదీగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. 26న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్ల ఉప సంహరించుకునేందుకు 29వ తేదీ వరకు గడువు ఉంది. నామినేషన్ల గడువు ముగిసిన వెంటనే తుది పోటీల్లో ఎంత మంది అభ్యర్థులు ఉన్నారనేది స్పష్టత రానుంది. మే 13న పోలింగ్ జరగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.

మంచి ముహూర్త బలం చూసుకుని ...

ఇదిలా ఉంటే, మంచి ముహూర్త బలం చూసుకుని నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ఖరారైన విషయం తెలిసిందే. మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పట్నం సునీతారెడ్డి, బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్, బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి ఎన్నికల బరిలోకి దిగిన విషయం తెలిసిందే. ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ పర్వం ప్రారంభం కానుండగా, 19, 21, 22, 24వ తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. 21వ తేదీ ఆదివారం కావడంతో ఆ రోజు నామినేషన్లు దాఖలు చేయడానికి, స్వీకరించడానికి అవకాశం లేదు. 19, 22, 24వ తేదీల్లో ఎక్కువ నామినేషన్లు అందజేసేందుకు అభ్యర్థులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఆరోజుల్లో అభ్యర్థులు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. చివరి రోజు తమ పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీలతో మరో సెట్ నామినేషన్ దాఖలు చేయాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. నామినేషన్ల ఘట్టాన్ని ఎవరికి వారు అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నేతలను ఆహ్వానించి వారి సమక్షంలో నామినేషన్లు దాఖలు చేయాలని వారు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే.



ఎన్నికల నోటిఫికేషన్	ఏప్రిల్ 18
నామినేషన్ల స్వీకరణ	ఏప్రిల్ 18
నామినేషన్లకు చివరి గడువు	ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 26
ఉపసంహరణకు గడువు	ఏప్రిల్ 29
పోలింగ్	మే 13
ఓట్ల లెక్కింపు	జూన్ 4

కోడ్ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

- మీడియా సమాశంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక



ఎన్నికల కోడ్ ఉల్లంఘించే ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియపై మంగళవారం రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో నిర్వహించిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. కోడ్ ఉల్లంఘన గురించి ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, అలాగే సీ-విజిల్ యాప్‌ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందన్నారు. ఎన్నికల నియమావళి అమలు తీరు పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ఇంటలిజెన్స్ కమిటీని నెలకొల్పనున్నట్లు చెప్పారు.

రూ.2.61లక్షల నగదు సీజ్

ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో రూ.2.61 లక్షల నగదు, రూ.4.18 లక్షల విలువ గల వెండి, 1.28 లక్షల విలువ గల ఫ్యాబ్రిక్స్, 69.51 లక్షల విలువగల మద్యం, 3.28 లక్షల విలువ గల డ్రగ్స్/నార్కొటిక్ సీజ్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

చేవెళ్ల పార్లమెంటు పరిధిలో 29,28,186 ఓటర్లు

చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గం కింద చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్లు వస్తాయని తెలిపారు. ఏడు నియోజకవర్గాలలో 29,28,186 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 2,824 పోలింగ్ కేంద్రాలు, 53 సహాయక పోలింగ్ కేంద్రాలు మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 13,443 పీవోలకు ఏపీవో, ఓపీవోలు ఉన్నారన్నారు. 259 సెక్టోరల్ అధికారులు ఉన్నారని ఒక్కో సెక్టోరల్ అధికారి 11 పోలింగ్ కేంద్రాలు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉన్న దగ్గరే రిసెప్షన్ సెంటర్ కూడా ఉంటుందని తెలిపారు.

బీఎస్ఐటీలో కౌంటింగ్ సెంటర్ ...

కౌంటింగ్ కేంద్రం చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీ నందు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ సెంటర్ వద్ద స్ట్రాంగ్ రూమ్స్ కూడా ఉందని, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద బారికేడ్లు, సివిల్ పనులు, కావలసిన వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలతో పాటు, ప్రత్యేక నిఘా ఉంటుందని ఆయన తెలిపారు. పరిస్థితులను బట్టి పోలింగ్ నాటికి వీటి సంఖ్య మారే అవకాశాలు ఉంటాయన్నారు. ఏఆర్‌వోలు జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరుగుతుంది అని అన్నారు.

పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



పర్వతాపూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

కొందుర్గు, ఏప్రిల్ 16 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వారు పనిచేస్తున్న చోట సౌకర్యాలు కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో అధికారులతో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ కాలం దృష్ట్యా కూలీలతో ఉదయం, సాయంత్రం పూటల్లోనే పనిచేయించాలని, పని చేసే స్థలంలో కూలీలకు నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడే తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఒక్కో కూలీకి రెండు లీటర్ల నీటిని అందించాలని, వ్యవసాయ బోర్ల నీటిని కూలీలకు అందించొద్దని, మిషన్ భగీరథ నీటినే ఇవ్వాలని సూచించారు. పనిచేసే కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, కూలీలు పనిచేస్తున్న చోట్లకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వెళ్లాలని సూచించారు. కూలీలకు గతంలో రోజువారీ కనీస వేతనం 272 రూపాయలు వస్తుండేదని, ప్రస్తుతం 300 రూపాలయ వరకు పెరిగిందని అన్నారు. పనిచేస్తాం అన్న వారందరికీ పనులు కల్పించాలన్నారు. నర్సరీల్లో లోకల్‌గా దొరికే మొక్కలను కూడా పెంచే విధంగా చూడాలని, నర్సరీల్లో మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని పట్టాలని అన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని, ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే, సీవిజల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కూలీలకు ఆరు వారాలుగా బిల్లులు రాకుంటే ఎలా? అని విలేకరులు ప్రశ్నించగా.. పనిచేసిన వారం రోజుల్లోనే కూలీల బిల్లులను అప్‌లోడ్ చేస్తామని, పెండింగ్ బిల్లులు వెంటవెంటనే వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు ముందు డీఆర్డీవో పర్వతాపూర్, గంగన్నగూడెం గ్రామాల్లో కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. రోజు కూలి 300 వచ్చే విధంగా పనులు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయులు, మండల ప్రత్యేకాధికారి శివలాల్, ఎంఈవో కిష్టారెడ్డి, ఎంపీవో లాలయ్య, ఏపీవో నర్సింగ్‌రావు, జంగయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

- ఉద్యాన శాఖ ఏడీ సంజీవ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ ఏడీ సంజీవ్‌కుమార్

యాచారం, ఏప్రిల్ 16 : ఏ గ్రామంలోనూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ ఏడీ సంజీవ్‌కుమార్ చెప్పారు. మంగళవారం యాచారం మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. నీటి ఎద్దడి రాకుండా గతంలో పనిచేసిన బోర్ల మరమ్మతులు చేయించి వాడుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీరు రాని రోజు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల్లో నీటి సరఫరా చేయాలన్నారు. రానున్న రెండున్నర నెలల పాటు ప్రజలకు తాగు, వాడకం నీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పీఎస్‌లను, గ్రామ ప్రత్యేకాధికారులను ఆదేశించారు. మూలనపడ్డ బోర్లను తక్షణమే బాగు చేయించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. మండలంలో 110 బోర్లు పనిచేస్తున్నాయని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. అవసరముంటే కొత్తగా పైప్‌లైన్లు వేసుకోవాలని, అందుకు పంచాయతీ నిధులు వినియోగించుకోవాలన్నారు. నెలలో మూడు సార్లు ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. అలాగే నాటిన మొక్కలకు రోజు విడిచి రోజు నీరు పోయాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు రెండు రోజులకోసారి ఫాగింగ్ చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ అయ్యప్ప, మిషన్ భగీరథ డీఈ లలిత, ఏఈ అనిరుధ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజు, ఏఈ రజిత, ఏఓ సందీప్‌కుమార్, ఏపీవో లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రంగోలీ వేసి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న మహిళలు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 : ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నిర్మల, కార్యదర్శి మహేశ్వరి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు రంగోలి, మెహందీ, మానవహారం తదితర కార్యక్రమాలు నిర్వహించి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, మన తలరాతలను మార్చుకునే సాధనమని ప్రతినిధులు అన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటును అమ్ముకోవద్దని, నచ్చిన వారికి స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడడం ప్రతీ పౌరుడి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు సరిత, కోశాధికారి స్వాతి, గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.



వండర్‌లా సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసు తనిఖీల్లో రూ.3.1లక్షలు స్వాధీనం

ఆదిబట్ల, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా చేపడుతున్న తనిఖీల్లో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం తనిఖీల్లో రూ3,10,000 పట్టుబడ్డాయని సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. బొంగ్లూరు సమీపంలో లక్ష, రావిరాల వండర్ లా సమీపంలో రూ.2.1లక్షలను స్వాధీనం చేసుకున్నామని,నగదును సంబంధిత అధికారులకు అందజేశామని, విచారణానంతరం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ తెలిపారు.

ఎమర్జింగ్ టెక్నాలజీపై పట్టు సాధించాలి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 16: కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఎమర్జింగ్ టెక్నాలజీపై పట్టు సాధించాలని హైదరాబాద్ జేఎన్టీయూ సీఈసీ హెచ్ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ కేపీ సుప్రీతి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం 'నేషనల్ కాన్ఫరెన్స్ ఇన్ ఎమర్జింగ్ ట్రెండ్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్' పేరుతో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ కేపీ సుప్రీతి మాట్లాడుతూ.. కార్పొరేట్ రంగంలో దూసుకుపోవాలంటే నేడు ఇంజినీరింగ్ సీఎస్ఈ విభాగంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్‌క్రైమ్ నేరాల నియంత్రణకు ఈకోర్సు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కోర్సులో ఆవిష్కరిస్తున్న కొత్త విధానాలను విద్యార్థులకు బోధించడానికి అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. మానవ మేధస్సుకు చిక్కని సాంకేతికతను ప్రపంచానికి అందజేయాలనే ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ ఏ.మోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ లోకనాథం, డీన్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ కేపీ సుప్రీతి

100ఫీట్ల ఎత్తులో జాతీయ జెండా

● తాండూరులో మున్సిపాలిటీలో ఏర్పాట్లు
● రూ.25లక్షల కేటాయింపు ● ఆగస్టులో ఆవిష్కరణ

తాండూరు, ఏప్రిల్ 16: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఏ మున్సిపాలిటీలో లేనివిధంగా తాండూరు మున్సిపాలిటీలో 100ఫీట్ల ఎత్తులో జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జాతీయ జెండాకు అవసరమైన జెండా దిమ్మె, పోల్ ఏర్పాటు పూర్తయింది. ఈజెండా ఏర్పాటుతో తాండూరు పట్టణానికి కొత్తశోభ సంతరించుకోనుంది. 100ఫీట్ల (30మీటర్ల) ఎత్తుజెండా, అదనంగా పైభాగంలో 5పీట్లతో విద్యుత్ లైటును ఏర్పాటు చేయనున్నారు. ఆగస్టు 15వ తేదీన ఈ ఎత్తైన జెండాను ఆవిష్కరించనున్నారు. గత జనవరిలో ప్రారంభించాలని ప్రయత్నించినప్పటికీ సమయం తక్కువగా ఉండటంతో సాధ్యం కాలేదని అధికారులు చెబుతున్నారు. వికారాబాద్ జిల్లాలో ఇంత పెద్దఎత్తున జెండాను ఏర్పాటు చేస్తున్న తొలి మున్సిపాలిటీ తాండూరు కావడం విశేషం. ఈజెండా ఏర్పాటుకు రూ.25లక్షలను పట్టణ ప్రగతినిధులను కేటాయించారు. కాంట్రాక్టర్ మూడు, నాలుగు రోజులుగా ఈ పనిలో నిమగ్నమయ్యారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ ప్రత్యేకచొరవతో ఈ ఎత్తైన జెండాను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. శాశ్వతంగా ఉండే విధంగా ఈ జెండాను ఏర్పాటు చేస్తున్నారు. ఫౌండేషన్, గ్రానైట్, లైటింగ్, 30మీటర్ల (100ఫీట్ల) పోల్ ఏర్పాటు పూర్తయింది. మున్సిపల్ ఇన్‌చార్జి డీఈఈ ఖాజా హుస్సేన్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు.



జెండా ఆవిష్కరణకు ఏర్పాటు చేసిన పోల్



జెండా పోల్‌కు పైభాగంలో అమర్చబడిన విద్యుత్ లైటు



సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో రోజా

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కడ్తాల్, ఏప్రిల్ 16 : మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషిచేయాలని ఆమనగల్లు సీడీపీవో రోజా అన్నారు. దీనిపై అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కడ్తాల్ రైతు వేదికలో మంగళవారం మహిళా శిశుసంక్షేమ శాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణా నిర్మూలన'పై అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజులు జరిగే కార్యక్రమానికి సీడీపీవో హాజరయ్యారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రోజా మాట్లాడుతూ వయస్సు, లింగ భేదం లేకుండా స్వలాభం కోసం కొందరు మానవులను అక్రమ రవాణా చేస్తుండడం అమానుషమన్నారు. 'ప్రజ్వల' మేనేజర్ బాలరామకృష్ణ మాట్లాడుతూ తమ సంస్థ 28ఏళ్లుగా లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడుతూ 28,500 మంది మహిళలను కాపాడిందన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రాయదుర్గంలో బీజేపీ ఎన్నికల ప్రచారం

రాయదుర్గం, ఏప్రిల్16 : గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా డివిజన్ అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు నీలం నరేందర్‌కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు నరేందర్ గౌడ్, సురేష్‌ముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, దయాకర్‌ముదిరాజ్, అశోక్‌కుమార్ ముదిరాజ్‌తో పాటు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై పునఃసమీక్షించాలి

▸▸ దక్షిణ మధ్య రైల్వే జీఎంకు విశ్వేశ్వర్‌రెడ్డి లేఖ

తాండూరు, ఏప్రిల్ 16: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పాత తాండూరులో దక్షిణ మధ్య రైల్వే నిర్మించతలపెట్టిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులపై అధికారులు పునఃసమీక్షించాలని, ప్రజాభీష్టం మేరకే పనులు చేపట్టాలని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీధర్‌లకు మంగళవారం వేర్వేరుగా ఈ విషయంపై లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనిర్మాణం కారణంగా నిర్వాసితులవుతున్న బాధితుల అభిప్రాయాలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్తి నష్టం ఎక్కువ జరుగుతుందని, ఈ నిర్మాణానికి అత్యధికంగా వ్యయం అయ్యేందుకు అవకాశం ఉన్నందున తక్కువ వ్యయంతో, తక్కువ ఆస్తి నష్టంతో రైల్వే అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు. స్థానికంగా ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండానే ఆగమేఘాలపై నిర్మాణం చేపట్టడమమేంటని ప్రశ్నించారు. ఈ నిర్మాణం వల్ల పేద, మధ్యతరగతి, దిగువ తరగతి ప్రజలు, ఇళ్లస్థలాలను, ఆస్తులను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడినందున పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వేస్టేషన్‌లో ట్రైన్ నంబర్ 17319, 17320 హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, ట్రైన్ నంబర్ 12793 రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బషీరాబాద్‌లో హాల్ట్‌కు అనుమతించాలని రైల్వే జీఎంకు పంపిన లేఖలో పేర్కొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం

భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్

యాచారం, ఏప్రిల్ 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుదామని భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకటరెడ్డి సొంత గ్రామంలో ఉదయ సముద్రం, దేవాదుల ప్రాజెక్టుల కాలువలను ఇప్పటివరకూ పూర్తి చేయలేకపోయారని, ఇరిగేషన్ ప్రాజెక్టు కాలువల పనులను గాలికొదిలేశారని అన్నారు. మంగళవారం యాచారం మండలంలోని గున్‌గల్ గ్రామంలో సీపీఎం మండల కార్యకర్తల విస్తృస్థాయి సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల విధానాల కారణంగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వలేకపోయిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఇప్పటికే పూర్తిచేసి ఉంటే నల్లగొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు తాగునీరు అందేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాదయ్య, సీపీఎం మండల కార్యదర్శి నర్సింహా, నాయకులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

▸▸ వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, ఏప్రిల్ 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఈవీఎం స్ట్రాంగ్ రూంలను తహసీల్దార్ బి.విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు, సిబ్బందికి భోజన సదుపాయం, వాహనాల పార్కింగ్‌ల ఏర్పాట్లపై కళాశాల చుట్టూ తిరిగి పరిశీలించారు. స్ట్రాంగ్ రూం చుట్టుపక్కల ప్రాంతాలను, ప్రధాన మార్గాలను పరిశీలించి రక్షణపరంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూం దగ్గర తనిఖీచేసి 24గంటల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక అధికారులు స్ట్రాంగ్ రూంలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూం దగ్గర కేంద్ర సాయుధ బలగాలతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ

▸▸ కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి, ఏప్రిల్ 16: జిల్లాలో రైతులకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం పరిగిలోని డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజనకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. వరి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు ఏ గ్రేడ్ రకం రూ.2203, సాధారణ రకానికి రూ.2183లు చెల్లిస్తున్నటు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో కావాల్సిన వసతులతోపాటు, తూకం మిషన్‌లు, టార్పాలిన్స్, గన్నీబ్యాగులు, తేమ మిటర్స్, ప్యాడి క్లీనర్స్, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాల కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పరిగి మినీ స్టేడియంలోని ఈవీఎంలు, వీవీప్యాడ్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్దకు 24 గంటలు భద్రత ఉండాలని సూచించారు. అంతేకాకుడా నస్కల్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నీటి సరఫరా, సమస్య ల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహరిత, డిపీవో గోపాల్, ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్‌వో రాజేశ్వర్, తహశీల్దార్ ఆనంద్‌రావు, డీసీఎంఎస్ డీఎం శ్యాంసుందర్‌రెడ్డి, ఏడిఏ లక్ష్మీకుమారి, ఏవో ప్రభాకర్‌రెడ్డి, డీసీఎమ్మెస్ పరిగి మేనేజర్ డి.వెంకటయ్యసంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నారాయణరెడ్డి

ఓటరు నమోదు పెండింగ్ ఫారాలు పూర్తి చేయాలి

ఓటరు జాబితా నమోదులో పెండింగ్ ఫారాలు అన్ని ఈ నెల 25 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాను తప్పులు లేని జాబితాగా రూపొందించాలన్నారు. అదే విధంగా జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు ఉపయోగపడే పనులు పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ బృందానికి టెలిక్నాఫరెన్స్ ద్వారా వివరించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి పెట్టాలి

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ కోటిరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మూడేళ్లుగా రోడ్డు ప్రమాదాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న 16 బ్లాక్ స్పాట్స్‌ను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి కారణాలను తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. బెల్ట్ షాపులను గుర్తించి వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్లపైన నూర్పిల్లు (కల్లాలు) చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ లాల్ సింగ్, పంచాయతీరాజ్ ఇఇ ఉమేష్, డిఎంహెచ్‌వో పల్వాన్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఇంజనీర్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.





హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఆమనగల్లు, ఏప్రిల్ 16: హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎర్రవోలు శ్రీను ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరిట ఓట్లు దండుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీను ఇంటింటికీ తిరిగి బీజేపీ పదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మరోమారు బీజేపీని ఆదరించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేవైఎం నాయకులు రాఘవేందర్, శివ, మహేశ్, పి.శివ, ఈదమయ్య, వెంకటయ్య, తదితరులున్నారు. అదే విదంగా తలకొండపల్లి మండల కేంద్రంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నాయకుడు శానమోని పాండు, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్‌లు యాదయ్య, తదితరులున్నారు.



ప్రచారంలో చేస్తున్న బీజేపీ నాయకులు

అవినీతిని నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా

▸▸ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మర్పల్లి, ఏప్రిల్ 16: ఐదేళ్ల తన ఎంపీ పాలనలో ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే తాను పోటీ నుంచి తప్పుకుంటానని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సవాల్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తనపై గెలవలేక కొంతమంది ఎంపీ అభ్యర్థులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. దాణా స్కాం, అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లకాంట్రాక్టుతో పాటు ఆలయాలను కూల్చివేయించామని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎవరైనా నిరూపిస్తే తాను పోటీనుంచి తప్పుకుంటానన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే వికారాబాద్ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరిగేలా కృషి చేస్తానన్నారు. గతంలో బీఆర్ఎస్‌లో ఎలా పనిచేశాననో, ఇప్పటి నుంచి కాంగ్రెస్‌లో అదే తరహాలో అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

కోట్లాది రూపాయలు మంజూరు చేయించా : స్పీకర్

నియోజకవర్గ అభివృద్ధికి తాను కోట్లాది రూపాయలు మంజూరు చేయించానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాను గెలిచిన మూడునెలల్లోపు ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు, చెరువులు, ప్రాజెక్టుల మరమ్మతులకు కోట్లాది రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియగానే వికారాబాద్ జిల్లాలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, తాను సన్నిహితులమని, నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైనా మంజూరు చేయించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష

శంషాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు పథకాలను వివరించి లోక్‌సభ ఎన్నికల్లో ఓటువేసేలా మద్దతు కోరాలని రంజిత్‌రెడ్డి అన్నారు. పెద్దషాపూర్‌లోని ఎస్వీరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మండల మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విశ్వేశ్వర్‌రెడ్డి తనపై లేనిపోని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. పార్టీ ఇన్‌చార్జి నరేందర్, మాజీ ఎంపీపీ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్‌ముదిరాజ్, తదితరులున్నారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలి

చేవెళ్ల : చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని రంజిత్‌రెడ్డి అన్నారు. నగరంలోని రంజిత్‌రెడ్డి నివాసంలో చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండలంలోని దామరగిద్ద, ఊరెళ్ల, సింగప్పగూడ మాజీ సర్పంచ్‌లు వెంకటేశంగుప్తా, జహంగీర్, రహీమాబేగం, సీనియర్ నాయకులు అలీ తదితరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నాయకులు వసంతం, శివకుమార్ గుప్తా, చేవెళ్ల పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా నాయకులున్నారు.



మర్పల్లి : మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

షాబాద్/మహేశ్వరం : లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పామెన భీంభరత్ అన్నారు. షాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. పీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌ఛైర్మన్ మల్లేష్, నాయకులు పాల్గొన్నారు. కాగా, కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. మంగళవారం రాత్రి తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో తుక్కుగూడలో కాంగ్రెస్‌లో చేరారు. కేఎల్లార్ మాట్లడుతూ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

మియాపూర్/చందానగర్/పహాడిషరీఫ్/ఎల్‌బీనగర్ : హస్తం గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీతారెడ్డి అన్నారు. హఫీజ్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ పూజిత, నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఎంటీసీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ జైపాల్ రంజిత్‌రెడ్డికి మద్దతుగా చందానగర్‌లో ప్రచారం నిర్వహించారు. పహాడిషరీఫ్‌లోని మల్లాపూర్‌లో వైఎఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన జల్‌పల్లి మున్సిపాలిటీ బూత్‌స్థాయిలో రంజిత్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పీసీసీ కార్యదర్శి ఎలిమేటి అమరేందర్‌రెడ్డి సూచించారు. ఇన్‌చార్జి నిజాముద్దీన్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సీనియర్ నాయకుడు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా తీగల పాల్గొన్నారు.

మైసిగండి రామాలయంలో..
శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ప్రారంభించిన ఆలయ ఫౌండర్‌ట్రస్టీ సిరోలిపంతూ
- మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగింపు


కడ్తాల్ : గణపతి పూజలో పాల్గొన్న భక్తులు

కడ్తాల్, ఏప్రిల్ 16: ప్రసిద్ధి గాంచిన కడ్తాల మండలం మైసిగండి రామాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని శ్రీ కోదండ రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు కొనసాగే ఉత్సవాల కోసం రామాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా, సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ ఈవో స్నేహలతతో కలిసి ఫౌండర్‌ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ ఉత్సవాలను ప్రారంభించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు, వేదపండితులు సుప్రభాత సేవతో స్వామివారికి మేలుపుకొలుపు పాడారు. అనంతరం సీతారాముల మూలవిరాట్‌లను పట్టు వస్త్రాలతో అలంకరించి విఘ్నేశ్వరపూజ, పుణ్యహవాచనం, అఖండ జ్యోతి స్థాపన, ధ్వజారోహనం, హోమశాల ప్రవేశం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాచలంలో మాదిరిగానే ప్రభుత్వ లాంఛనాలతో కల్యాణం నిర్వహిస్తారు. హైదరాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్, వికారాబాద్, యాదగిరి గుట్ట, మేడ్చల్, కరీంనగర్, మెదక్, వరంగల్, మహబూబ్‌నగర్ తదితర జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు.

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

ఆమనగల్లు : యజ్ఞ యాగాలు, దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహద పడుతాయని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ తల్లోజు లలితవెంకటయ్య, కౌన్సిలర్ తల్లోజు విజయ్ కృష్ణ అన్నారు. పట్టణంలోని హనుమాన్ ఆలయంలో హోమం, పూజలు నిర్వహించారు. తల్లోజు లలితవెంకటయ్య, నేనావత్ నీలారాంపాల్ నాయక్, తల్లోజు వైష్ణవి విజయ్‌కృష్ణ దంపతులు హోమం నిర్వహించారు. నాయకులు కండె సాయి, మేడిశెట్టి శ్రీధర్, లక్ష్మణ్, శ్రీకాంత్‌సింగ్‌లున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

షాబాద్ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని కొమరబండలో బుగ్గరామేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీలు చెన్నయ్య, మల్లేష్, నాయకులు సుభాష్‌చంద్రబోస్, చెన్నయ్య, జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేష్, శ్రీనివాస్, దయానంద్, అఖిల్, విశాల్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ధ్వజారోహణం

షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజారోహణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నేడు(బుధవారం) 12 గంటలకు రాములోరి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. గ్రామస్థులు తదితరులున్నారు.


షాబాద్ : సీతారాంపూర్‌లో ధ్వజారోహణంలో పాల్గొన్న పురోహితులు, భక్తులు

వేంకటేశ్వరాలయంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాబోతున్నాయి. వనపర్తి సంస్థానాధీశుడు రాజా సవై వెంకటరెడ్డి 300 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో బుధవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ఈనెల 23 వరకు కొనసాగుతాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు జరిగే కళ్యాణోత్సవాలు, దర్శనాలు, అన్నదాన కార్యక్రమాల కోసం అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యం కోసం ఏర్పాట్లు చేశారు. అలాగే దాతల సహకారంతో ఆలయానికి రంగులు వేయించి, సర్వాంగ సుందరంగా మార్చారు.


షాద్‌నగర్ అర్బన్ : కల్యాణోత్సవానికి మండపాన్ని శుభ్రం చేస్తున్న బక్కని నర్సింహులు, తదితరులు

నేడు శ్రీరాముడి శోభాయాత్ర

శ్రీరామ నవమిని పురస్కరించుకుని షాద్‌నగర్ పట్టణంలో నేడు(బుధవారం) సాయంత్రం 4.00 గంటలకు శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించబోతున్నట్లు హిందూవాహిని నాయకుడు చెట్ల వెంకటేష్ తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై మెయిన్‌రోడ్డు మీదుగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు.

రాములోరి కల్యాణానికి ఆలయాలు ముస్తాబు

ఆమనగల్లు/కేశంపేట : శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవానికి ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని ప్రముఖ దేవాలయాలు ముఖ్యంగా రామాలయాలు ముస్తాబయ్యాయి. నిర్వాహకులు ఇప్పటికే విశాల వసతులు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద తగిన వసతులు కల్పించారు. నేడు(బుధవారం) కల్యాణ నేపథ్యంలో ఆలయాలకు రంగురంగుల విద్యుద్దీపాలు, పచ్చటి తోరణాలతో శోభాయమానంగా, సర్వాంగ సుందరంగా అలంకరించారు. మైసిగండిలో మంగళవారం ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలతలు, స్థానిక నాయకులు, ఆలయ సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఖ్యాతిగాంచిన కడ్తాల మండలం బాలాజీనగర్ తండా సమీపంలో గల ధనరాశి పర్వతంపై గల రాధాకృష్ణ దేవాలయం కల్యాణానికి ముస్తాబైంది. కేశంపేట మండలంలో శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు చేశారు. మంగళగూడంలోని పెద్ద గుట్టపై సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే లింగంధన, తొమ్మిదిరేకుల, కొండారెడ్డిపల్లి, నిర్దవెల్లి, బొదునంపల్లి, లేమామిడి, వేముల్‌నర్వ, ఇప్పలపల్లి, తదితర గ్రామాలలో ఆలయాలను నిర్వాహకులు శుభ్రం చేశారు.


కేశంపేట : వేముల్‌నర్వలోని హనుమాన్ ఆలయం ముందు పందిరి వేసిన నిర్వాహకులు

క్రైం కార్నర్

కళ్లల్లో కారం చల్లి..
రెండు గొర్లు, వెండి నగలు అపహరణ

- గొర్ల కాపరిపై దారి దోపిడీ దొంగల అఘాయిత్యం

మహేశ్వరం, ఏప్రిల్ 16 : గొర్ల కాపరి కళ్లల్లో కారం చల్లటంతో పాటు దాడిచేసి వెండి ఆభరణాలు, రెండు గొర్లను అపహరించుకుపోయిన ఘటన మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన మారమోని మల్లయ్య(63) మంగళవారం సాయంత్రం తుమ్మలూరు-కొత్తూరు శివారు ప్రాంతంలో గొర్లను మేతకు తీసుకెళ్లాడు. గుర్తుతెలియని ముగ్గురు దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి మల్లయ్య కళ్లల్లో కారం చల్లి పిడిగుద్దులు గుద్ది చేతులకు ఉన్న వెండి ఆభరణాలు, చెవి పోగులతో పాటు రెండు గొర్లను ఎత్తుకెళ్లారు. మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిందర్ తెలిపారు.

అర్ధరాత్రి ఇంట్లో చోరీ

షాబాద్, ఏప్రిల్ 16 : గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సంకేపల్లిగూడకు చెందిన కుమ్మరి చెన్నయ్య ఇంట్లోకి ఇద్దరు దండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తలపై టోపి, ముఖానికి దస్తీ కట్టుకొని ఖట్టర్‌తో వచ్చి మొదట సీసీ కెమెరా వైర్లను కట్ చేశారు. సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నట్లు రికార్డయ్యింది. కాగా, కింది అంతస్థుకు తాళం వేసి పైఅంతస్థులో కుటుంబ సభ్యులు చెన్నయ్య తల్లి, చెల్లి, అల్లుడు నిద్రిస్తున్నారు. దొంగతనానికి వచ్చిన దుండగులు పైఅంతస్థులో వారు నిద్రిస్తున్న ఇంటి తలుపునకు బయటి నుంచి గడియ పెట్టారు. కింది అంతస్థుకు వచ్చి శబ్దం రాకుండా తాళానికి చీర చుట్టి విరగ్గొట్టారు. లోపలికి వెళ్లి బీరువా తాళం సైతం పగులగొట్టి వస్తువులను చిందరవందరగా చేసి తులం వెండి ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి వచ్చి క్లూస్‌టీం బృందం సభ్యులతో దుండగుల ఆధారాలు సేకరించారు.

టిప్పర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ చెక్‌పోస్టు వద్ద జరిగింది. మదనపల్లి కొత్తతండాకు చెందిన కొర్ర సిద్దు పని నిమిత్తం బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరి పాలమాకుల గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి మదనపల్లి కొత్తతండాకు వస్తుండగా మార్గమధ్యలో పెద్దషాపూర్ చెక్‌పోస్టు వద్ద బైక్‌ను టిప్పర్ ఢీకొట్టింది. సిద్దు తలకు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, పోలీసులు లిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మరణంపై అనుమానాలున్నాయని కుమారుడి ఫిర్యాదు

శంషాబాద్ రూరల్, 16 : తండ్రి మరణంపై అనుమానం ఉందని ఓ వ్యక్తి మంగళవారం శంషాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. భైండ్ల బాలరాజ్, అతడి తమ్ముడు అనిల్‌లు సుల్తాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని కేబీ దొడ్డి గ్రామంలో నివాసముంటున్నారు. బాలరాజ్ పెయింటింగ్ పని కోసం కొన్ని రోజులుగా ప్రొద్దుటూర్‌లో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 8.30గంటల సమయంలో శివకుమార్ అనే వ్యక్తి బాలరాజ్‌కు ఫోన్ చేసి మీ తండ్రి మరణించాడని చెప్పాడు. దాంతో అతను స్వగ్రామానికి వెళ్లి తండ్రి లక్ష్మణ్(60) నడుము భాగం, కాళ్ల ఇతర భాగాల వద్ద చీమలుండడం చూసి విస్తుపోయాడు. తల్లి నవనీతపై తనకు అనుమానం ఉందని, పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శంషాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యాచారంలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

- భారీగా కాంగ్రెస్‌లో చేరిన నాయకులు


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

యాచారం, ఏప్రిల్ 16 : మండలంలో లోక్‌సభ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల చైర్మన్ కె.జోగిరెడ్డిలతో పాటు దాదాపు రెండు వందల మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నగరంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే మల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి పరిచయం చేశారు. ఎంపీ ఎన్నికల ముందు ముఖ్యనాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలినట్లయింది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థికి కనీసం 40 వేల మెజార్టీ ఇవ్వడం ఖాయమన్నారు. బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో దళితబంధు అర్హులకు అందలేదని, గ్రామాల ప్రగతి కుంటు పడిందన్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు ముత్యాల వెంకటరెడ్డి, కొత్తకుర్మ సత్తయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మస్కు నర్సింహ తదితరులున్నారు. కాగా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధికి అధికంగా నిధులిచ్చి ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపినట్లు నాయకులు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించడంపై దృష్టి కేంద్రీకరించాలని ఎమ్మెల్యేకు సూచించినట్లు తెలిపారు.

బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా కమిటీ

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16 : జిల్లా ఎస్టీ మోర్చా కమిటీని పూర్తిస్థాయిలో ఎన్నుకోవడం జరిగిందని బీజేపీ ఎస్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు బనావత్ సాయిలాల్ నాయక్ తెలిపారు. జిల్లా ఎస్టీమోర్చా ఉపాధ్యక్షులుగా జర్పుల సూర్యనాయక్, లక్ష్మీనాయర్, బనావత్ మోతిలాల్ నాయక్, మెగావత్ హన్మంత్‌నాయక్, జె.లక్ష్మణ్‌నాయక్, కె.క్రిష్ణనాయక్, ఎస్.రవినాయక్ ఎన్నికైనట్లు చెప్పారు. జనరల్ సెక్రటరీలుగా ఎం. గణేష్ నాయక్, జె. వినోద్ నాయక్ ఎన్నిక కాగా, సెక్రటరీలుగా కెతావత్‌కుమార్ నాయక్, రమావత్ బాలు నాయక్, జతావత్ పంత్ నాయక్, ఆర్.చందు నాయక్, మెగావత్ మోహన్ నాయక్ ఎన్నికైనట్లు తెలిపారు. కోషాధికారిగా కెతావత్ మోహన్ నాయక్, సోషల్‌మీడియా కన్వీనర్‌గా నందు రాథోడ్, మీడియా కన్వీనర్‌గా జతావత్ నిరంజన్ నాయక్, మహిళా కన్వీనర్‌గా ధరావత్ భాగ్యలక్ష్మి నాయక్ ఎన్నికైనట్లు చెప్పారు. స్పోక్‌పర్సన్లుగా ఎరుకల నర్సింహులు, కతావత్ రవీంద్రనాయక్, జతావత్ కుమార్ నాయక్, బాబు రాథోడ్, సభ్యులుగా కొర్ర సాయికుమార్ నాయక్, కతావత్ లోకేష్‌నాయక్, సంతోష్ నాయక్, సభావత్ నాయక్, వత్యావత్ రవీందర్ నాయక్, కొర్ర రవి నాయక్, మెగావత్ నర్సింహ నాయక్ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

బీజేవైఎం జిల్లా కమిటీ

మహేశ్వరం, ఏప్రిల్ 16 : బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా టి.యాదీష్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా బోద యాదగిరిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సాయి, రూపక్, రాఘవేందర్, గోవర్ధన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా దిలీప్‌గౌడ్, మల్లేష్, కోశాధికారులుగా మహేష్‌చారి, బి. సాయిలులతో పాటు మరో 30 మందితో బీజేవైఎం జిల్లా కమిటీని ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు టి.యాదీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీజేవైఎంను మరింత బలోపేతం చేయడంతో పాటు యువత సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ శిబిరం

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈనెల 20వ తేదీ నుంచి ఏఎస్‌వీ (అకాడమీ స్పోర్ట్స్ విలేజ్)లో ఉచితంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు టెన్నిస్, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. అజీజ్‌నగర్‌లోని ఈ స్పోర్ట్స్ విలేజ్‌లో 20వ తేదీ నుంచి 15 రోజుల పాటు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు రూ.2,500 ఫీజుతో శిక్షణ ఇవ్వనున్నారు. కాగా, ఆసక్తి గల వారు ఈ నెంబర్ (9515125592)కు ఫోన్ చేసి, మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు


మాట్లాడుతున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్, ఏప్రిల్ 16: సమస్యల పరిష్కారంపై అధికారులు అలసత్వం వహించరాదని, వేసవి నేపథ్యంలో గ్రామాలలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎంపీటీసీ సభ్యులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, లచ్చిరామ్ నాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబాలు మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ఏదైనా కారణం చేత మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యమ్నాయ చర్యలు తీసుకోవాలని, వెంటనే గ్రామ పంచాయతీల తాగునీటి పథకాల ద్వారా అందించాలని వారు కోరారు. కడ్తాల మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జడ్పీటీసీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ బావండ్ల పల్లి ఆనంద్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు. కొత్త ప్రతిపాదనలు ఏమి చేయకుండా ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సమస్యలపై చర్చించారు. వేసవి ఎండల నేపథ్యంలో విద్యుత్, తాగునీటి సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, లచ్చిరామ్‌నాయక్, బాబా, ఉమావతి, రాములు కోరారు. కడ్తాల గ్రామంలోని బీసీ కాలనీలో విద్యుత్ లో-వోల్టేజి సమస్య ఉందని దాన్ని పరిష్కరించి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సభ్యులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, జహంగీర్ బాబా లు సభలో ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ నరేందర్ తెలిపారు. మండలంలో అనేక మంది రైతుల భూములు రికార్డులలో నమోదు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని జడ్పీటీసీ దశరథ్ నాయక్ సభ దృష్టికి తెచ్చారు. గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాలలో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్ నాయక్ లు కోరారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల, ఏప్రిల్ 16 : ప్రజలు అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఫైర్‌స్టేషన్ అధికారి భిక్షపతి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బందితో కలిసి పలు కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చిన్నపిల్లలను వంటగదిలో వదిలి పెట్టకూడదని తెలిపారు. ఫైర్ సిబ్బంది ప్రశాంత్, గోపాల్, సురేందర్, సిద్దు, ఖాజా తదితరులున్నారు.

బీజేపీ పాలనకు చరమగీతం పాడాలి

కడ్తాల్, ఏప్రిల్ 16 : దేశంలో కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ విధ్వంసకర పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరా శోభన్ అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ తరహా దేశంలో బీజేపీని గద్దె దించేందుకు కాంగ్రెస్ శ్రేణులంతా కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందిరా శోభన్ మాట్లాడుడూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సాధించిన ప్రగతి ఏమీ లేదని, తెలంగాణ రాష్ట్రానికి అన్ని రంగాల్లో తీరని అన్యాయం చేసిందని ఆమె మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకుని సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వడం జరుగుతుందన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, తదితరులున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు


దాసర్లపల్లి తండాలో సమస్యలు తెలుసుకుంటున్న ట్రాన్స్‌కో ఎస్ఈ గోపయ్య

కందుకూరు, ఏప్రిల్ 16 : వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఎల్.గోపయ్య తెలిపారు. మండలంలోని దాసర్లపల్లి తండాలో గిరిజన రైతు జగ్గునాయక్‌కు విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నట్లు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. దాంతో ట్రాన్స్ ఎస్ఈ స్పందించి మంగళవారం ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. జగ్గునాయక్‌తో పాటు అతని సోదరులు లాలునాయక్, భీమానాయక్, దాస్యానాయక్‌లకు ఒక్కొక్కరికి సంబంధించి 20గుంటల చొప్పున వ్యవసాయ భూమి ఉంది. జగ్గునాయక్ బోరుమోటరు రెండు నెలలక్రితం ఎండిపోవడంతో పంటకు నీరు పెట్టడం కష్టంగా మారింది. కాగా, ఎక్కడైన విద్యుత్ సమస్యలుంటే మరమ్మతులు చేపట్టడానికి సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు ఎస్ఈ తెలిపారు. ఆయనతో డీఈ రాజారామ్‌రెడ్డి, డీఈ (లైన్స్) పి.చంద్రశేఖర్, ఐడీఏ కేవీఎన్ రెడ్డి, ఏఈ రమేష్ గౌడ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

చౌదరిగూడ/కేశంపేట/కొందుర్గు, ఏప్రిల్ 16: ఎండకాలం గ్రామాల్లో తాగునీటి సమస్యల పట్ల ప్రత్యేకాధికారులు దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో మల్లారెడ్డి సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి తాగునీటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీటీ అర్షద్, ఎంపీవో విజయ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండ చర్యలు తీసుకోవాలని కేశంపేట మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ ఏడీ రాజారత్నం సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వేసవిలో తాగనీటి సరఫరా యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ నాగమణి, ఎంపీవో నర్సింలు, కార్యదర్శులు పాల్గొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కొందుర్గు మండల ప్రత్యేకాధికారి శివలాల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు మందిరంలో పంచాయితీ కార్యదర్శులతో, అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీరంగాపూర్‌లో 3సింగిల్ ఫేజ్ బోర్లు వట్టిపోయాయని, రెండు సింగిల్ ఫేజ్ బోర్లలో నీటిమట్టం తగ్గిపోయిందని, మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని కార్యదర్శి రాజేందర్ తెలిపారు. ఎంపీడీవో ఆంజేయులు మాట్లాడుతూ తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో ఊరికి దగ్గరగా ఉన్న వ్యవసాయ బోర్లతో తాగునీటిని అందిస్తామన్నారు.

సంక్షిప్తంగా..

యాచారం : గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే తక్షణమే సమాచారమందించాలని, చైన్‌స్నాచింగ్‌కు పాల్పడే వారి పట్ల మహిళలు అప్రమత్తంగాఉండాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ ఎ.నర్సింహారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దండగులు కళ్లలో కారం కొట్టి మంగళసూత్రాలు దొంగిలిస్తున్నారని గుర్తుచేశారు. రాత్రివేళ ఆరుబయట నిద్రించరాదని తెలిపారు.

కందుకూరు : మండలంలోని ప్రజలకు అత్యవసర సేవలందిస్తున్న 108, 102 అంబులెన్స్ వాహనాలను మంగళవారం 108 రంగారెడ్డి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనంతో పాటు రాచులూరు గ్రామంలో ఉన్న 102 వాహనాన్ని పరిశీలించి, సిబ్బంది పనితీరు, ఆక్సిజన్ సరఫరా, రికార్డులను పరిశీలించారు. జిల్లా కో-ఆర్డినేటర్ రాజబాబు మాట్లాడారు. సన్‌స్ట్రోక్, డీహైడ్రేషన్‌కు గురైన వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈఎంటీ కుమార్, పైలెట్ యాదయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో దేశం అద్భుత విజయాలు సాధించిందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్ అన్నారు. బీజేపీతోనే సుస్థిర, సమర్థ, అవినీతి రహిత పాలన సాధ్యమన్నారు. మండల కేంద్రంలో నమో యువ సంకల్ప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాపార స్థలాలు, బస్‌స్టాప్ వద్ద కరపత్రాలను అందజేసి మోదీ సర్కార్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు మన్యనాయక్, తదితులున్నారు.

షాద్‌నగర్ రూరల్ : వచ్చే విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వం పంపిణీ చేసే ఏకరూప దుస్తులు కుట్టేందుకు మహిళా సంఘాల సభ్యులు విద్యార్థుల నుంచి కొలతలు తీసుకున్నారు. ఇటీవల సీఎం యూనిఫాం కుట్టు మహిళా సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ ఉన్నత పాఠశాలలో సంఘం అధ్యక్షురాలు యశోదమ్మ, వీవోఏ భవానీ కొలతలు తీసుకున్నారు.

యాచారం : విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న పుడమి పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్ష కార్యదర్శులు రవి, ఎస్.కృష్ణలు అన్నారు. ఈమేరకు ఏఈవో వెంకటరెడ్డికి మంగళవారం వినతిపత్రం ఇచ్చారు.

ప్రతీ ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలి

చేవెళ్ల, ఏప్రిల్ 16 : ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని డీడబ్ల్యూవో పద్మజారమణ, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి ఐసీడీఎస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల భాగస్వామ్యంలో భాగంగా అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్, తాగునీరు, తదితర సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం శంకర్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. పలు అంశాలపై సభ్యులు, అధికారులు చర్చించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు నీటి సమస్య లేదని.. ఇకముందు కూడా ఇబ్బందుల తలెత్తకుండా ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

ప్రహరీతో ఆలయ స్థల పరిరక్షణ : బక్కని

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 16: షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రహరీని నిర్మించి, గేట్లు ఏర్పాటు చేయడంతో స్థలాన్ని పరిరక్షించినట్టయిందని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అభిప్రాయపడ్డారు. దాతల సహకారంతో ఆలయం చుట్టూ ప్రహరీని నిర్మించారు. దాత విరపనేని సురేంద్ర ఆర్థిక సహాయంతో తయారు చేయించిన గేటును మంగళవారం ఆలయ ప్రహరీ ఈశాన్యం వైపు బిగించారు. బక్కని మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణంతో ఉత్తరం వైపు ఉన్న స్థలం పార్కింగ్‌కు, జాతరకు అనువుగా మారిందన్నారు.